కథ

**ఇంటరు ఫస్టియర్‌లో మార్కులు తక్కువ వచ్చాయని పురుగుల మందు తాగి చావుబ్రతుకుల్లో ఉన్న పదహారేళ్ల అబ్బాయిని మా హాస్పిటల్‌కు తీసుకువచ్చారు.**

# చేజారితే... తిరిగి రానిది జీవితం!

మృత్యువుతో పోరాడుతున్న ఆ పిల్లాడిని చూస్తే ఎంతో బాధ జాలీ కలిగాయి. అదే సమయంలో పిల్లలనీస్థితికి నెడుతున్న ఈ విద్యావిధానం మీదా, దాన్ని పెంచిపోషిస్తున్న ప్రైవేటు కాలేజీల మీదా... ర్యాంకుల వేటలో తమ పిల్లల్ని పరుగులు తీయిస్తున్న తల్లిదండ్రుల మీదా చాలా కోపం వచ్చింది.

ఏమైతేనేం? మరో పసిమొగ్గ..రేకులు విచ్చుకోకుండానే..జీవితంలోని ఏ ఆనందమూ అనుభవానికి రాకుండానే అర్థాంతరంగా నేలరాలిపోయింది.

డాక్టరుగా నిత్యం ఎన్నో చావులు చూస్తున్నా..ఇలా టీనేజీ పిల్లలు... ప్రేమ విఫలమయ్యో, చదువు భారమై డిప్రెషన్‌కు గురయ్యో ఇలా ఆత్మహత్యలకు పాల్పడి ఇక్కడికి వచ్చినప్పుడల్లా ఎప్పటికప్పుడు నన్ను కదిపి, కుదిపేస్తుంటాయి. ఎప్పట్లాగే నా మనసు గతంలోకి, నా సంగీత జ్ఞాపకాల్లోకి జారిపోయింది.

* * *

అప్పుడే కళ్ళు తెరిచిన పసిపాపలా అమాయకంగా ఉంటుంది సంగీత. తను నవ్వితే గలగలపారే సెలయేళ్లే గుర్తుకువస్తాయి. నిష్కల్మషమైన ఆ చూపుల్లో ప్రేమ, కరుణ తప్ప..స్వార్థం, కపటం మచ్చుకైనా కనిపించవు.

నేను ఎమ్‌సెట్ కోచింగ్ సెంటర్లో జాయినయిన మర్నాడే తనూ జాయినయింది మా సెంటర్లో. మొదట్లో అందరిలాగా నేనూ అంటీ ముట్టనట్లుగా ఉండిపోయాను. తను నార్తిండియన్ కావడం, తన వచ్చీరానీ తెలుగు, ఇంగ్లీషు, హిందీ మిక్స్‌డ్ లాంగ్వేజీ మొదటి కారణమైతే, ఇక్కడి వాతావరణం రెండో కారణం. అక్కడ చేరిన వాళ్లకు ఎవరికీ మనసూ, స్పందనా ఉన్నట్లు అనిపించదు. కేవలం యంత్రాల్లా తమ పనులు తాము చేసుకుంటూ, కీ ఇచ్చిన బొమ్మల్లా కదుల్తూ వుంటారు. అక్కడ చేరి దాదాపు నెలరోజులైనా ఎవరితోనూ ఎవరూ మనసు విప్పి మాట్లాడగా చూడలేదు. ఎప్పుడూ కొంపలు మునిగిపోతున్నట్లుగా హడావిడి! తనకంటే పక్కవాళ్లకి ఎగ్జామ్‌లో ఓ రెండు మార్కులు ఎక్కువ వస్తే..మరునాటినుండీ వాళ్లని బద్ధశత్రువుల్లా చూడడం, తక్కువ వచ్చిన వాళ్లతో కలిస్తే... తమకున్న తెలివితేటలు ఎక్కడ తగ్గిపోతాయోనన్న భయం! అర్థంలేని పోటీ..అంతం లేని ఆరాటం!

అతికించుకున్న నవ్వులతో-ఒకరినొకరు అనుమానంగా చూసుకుంటూ తిరుగుతున్న నాతోటి వాళ్లను చూస్తే మతిపోయినట్లయింది నాకు. ఇంటరు వరకూ ఆడుతూ పాడుతూ స్నేహితుల మధ్య హాయిగా తిరిగిన నాకు చదువొక భారంగా అనిపించలేదెప్పుడూ. కానీ ఈ ఎమ్‌సెట్ కోచింగ్‌లో జాయినయ్యాక అక్కడి వాతావరణం నాలో చదువుపట్ల ఉత్సాహానికి బదులు నిస్తేజాన్ని నింపాయి.

అందుకే అందరిలో ఒకరిగానే సంగీతను చూశానుగానీ ప్రత్యేకంగా అనుకోలేకపోయాను తన గురించి. ఆ సంఘటన జరగకపోతే అసలెప్పటికీ పట్టించుకునేదాన్ని కాదేమో సంగీతను.

నా ఫిజిక్స్ బుక్ కనిపించలేదు. మరునాడే మంత్లీ టెస్ట్! ఇదే మొదటి మంత్లీ టెస్ట్ కావడంతో నేను చాలా టెన్షన్‌గా ఉన్నాను. దానికితోడు పుస్తకం మిస్ కావడం మరింత గాబరాను పెంచింది నాలో. నేను గాబరాగా బుక్ వెదుక్కుంటున్నాను. ఇక ఏడుపొక్కటే తక్కువ నాకు. అలాంటి స్థితిలో సంగీత వచ్చింది నా రూమ్‌కి.

"ఏంటి ఉషా! డల్‌గా ఉన్నావ్?" అంటూ.

ఆ సమయంలో ఎవరు పలకరించినా చాచిపెట్టి కొట్టాలనిపిస్తోంది నాకు. పళ్ల బిగువున కోపాన్ని అదిమిపెట్టి.."నా ఫిజిక్స్ బుక్ కనిపించడం లేదు" అన్నాను నీరసంగా.

"ఇదేనా?" అంటూ అప్పటివరకూ వెనక్కి ఉంచిన చెయ్యి ముందుకు చాపింది. తన చేతిలో నా ఫిజిక్స్ బుక్!

దాన్ని చూడడంతోనే వెర్రి ఆనందంతో అరిచేశాను నేను.

"ఆ..అదే! నీకెలా దొరికింది?" అన్నాను సంగీత వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఇందాక స్టడీహాల్లో కనిపించింది. దీనిమీద పేరు లేకపోవడంతో ఎవరిదో అర్థం కాలేదు. అయినా ఉండలేక తీశాను. సాయంత్రం టీ టైమ్‌లో నీ రూమ్మేటు సునీత, నీ బుక్ కనిపించలేదని ఎవరితోనో అంటూంటే విన్నాను. అందుకే తీసుకువచ్చాను. బాగా చదువుకో!" అంటూ బుక్ నా చేతికిచ్చి వెళ్లిపోయింది, నాకు థాంక్స్ చెప్పే ఛాన్సు కూడా ఇవ్వకుండా. మరొకరైతే నాకెంతో మహోపకారం చేసినట్లు ఫోజు పెట్టి అంత నిర్లక్ష్యం అయితే ఎలా? అంటూ హెచ్చరించి వెళ్లేవాళ్లు.

కానీ అవేం లేకుండా..అసలేం జరగనట్లుగా నిర్వికారంగా వెళ్తున్న సంగీతను చూస్తే మొదటిసారిగా తన మీద ఇదీ అని వివరించి చెప్పలేని భావం కలిగింది నాకు. తను వచ్చి వెళ్ళాక నా మనసెంతో తేలికయినట్లు అనిపించింది. ఈ జనారణ్యంలో నాకో తోడు దొరికిన రిలీఫ్ కలిగింది ఆ క్షణాన.

మరునాడు డైనింగ్ హాల్లో కనిపించింది సంగీత. నేను నవ్వుతూ దగ్గరకెళ్లాను.

"ఎగ్జామ్ బాగా రాశావా?" అంది.

"ఆ..నువ్వెలా రాశావు?" అనడిగాను.

"ఏమో, తెలీదు!" అంది నిరాసక్తంగా.

"అదేం?" అన్నాను నేను ఆశ్చర్యపోతూ.

"అన్నీ వచ్చినట్లే ఉన్నా..ఇచ్చిన టైంలో..అంత ఫాస్ట్‌గా ఆన్సర్ చెయ్యలేకపోయాను" అంది సంగీత.

"ఇంటర్‌లో నీ పర్సంటేజి ఎంత?" అనడిగాను కుతూహలంగా.

"నైంటీ టూ పర్సంట్! మరి నీది?" అనడిగింది నావంక చూస్తూ.

"నాది ఎయిటీనైన్..షార్ట్ టర్మ్‌లో నీ రేంకెంత?" అనడిగాను.

"పన్నెండు వేలు!" అంది సంగీత తేలిగ్గా నవ్వుతూ.

"అదేంటీ? ఇంటర్లో నాకంటే నీకే ఎక్కువ మార్కులు వచ్చాయి. నా రేంకు నాలుగు వేలే!" అన్నాను నేను తన వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏమో ఉషా! మనం రెండు సంవత్సరాలపాటు కష్టపడి నేర్చుకున్నదంతా, మూడు గంటల్లో నిరూపించుకోవడం అనేది నాకసలు అంతుపట్టదు. అసలీ ఎమ్‌సెట్ గోల నాకు వద్దంటే..మా మమ్మీ డాడీ వినరు. మా డాడీ ఎయిర్‌ఫోర్సులో పెద్ద ఆఫీసరు. మా కాలనీలో వాళ్ల పిల్లలంతా బి.టెక్., ఎమ్.టెక్‌లు, ఐ.ఏ.యస్‌లూ చేశారట! ఎలాగైనా నేను 'మెడిసిన్' చెయ్యాలని నాన్నగారి కోరిక. అందుకని నన్నీ అరణ్యంలో తెచ్చి పడేశారు. ఇక్కడంతా గందరగోళంగా ఉంటుంది. ముఖ్యంగా నాకు తెలుగు సరిగ్గా రాకపోవడం పెద్ద ప్రాబ్లమ్ అయిపోయింది. ఎవరూ సరిగ్గా మాట్లాడరు. హైదరాబాద్‌లో ఉండగా ప్లస్ టూ వరకూ ఇంగ్లీషు మీడియం వలన ఈ భాషా ప్రాబ్లమ్ తెలిసి రాలేదు. ఆపైన నేను హిందీ ఫ్లూయంట్‌గా మాట్లాడతాను గనుక ఏ ఇబ్బందీ తెలియలేదు. ఇక్కడికొచ్చాకే మొదలైంది సమస్యంతా!" అంది సంగీత, సగం ఇంగ్లీషు సగం తెలుగూ ఉపయోగించి మాట్లాడుతూ.

తన ఏక్సెంట్ అర్థం చేసుకోవడం కష్టమే అయినా విషయం మాత్రం అర్థమైంది. పాపం! సంగీతను చూస్తే చాలా జాలనిపించింది. తనికి ఒంటరితనంతో బాధపడకుండా చూడాలని నిర్ణయించుకున్నానా క్షణానే!

నేనేం మాట్లాడకపోయేసరికి 'బోర్ కొట్టానా?' అంది సంగీత నొచ్చుకుంటున్నట్లుగా.

"నే, నే..నాటెటాల్! నువ్వు చెప్పిందాని గూర్చే ఆలోచిస్తున్నాను" అన్నాను నేను అభిమానంగా తన వైపు చూస్తూ.

"థాంక్యూ!" అంది సంగీత నా చెయ్యి మృదువుగా నొక్కుతూ.

అప్పటి నుండి ఏ కాస్త టైమ్ దొరికినా..మేమిద్దరం కలిసి కబుర్లు చెప్పుకునేవాళ్లం.

క్లాసులో ఏ క్వశ్చన్ అడిగినా తడుముకోకుండా జవాబులు చెప్పే సంగీత..ఎగ్జామ్‌లో దానికి తగినట్లు మార్కులు స్కోర్ చేయలేకపోయేది. సంగీతను అనేక సార్లు క్లాసులోనూ, ఆఫీసుకు పిల్చీ ఇన్‌స్ట్రక్టర్స్, డైరెక్టరు గారూ చీవాట్లు పెట్టారు. దాంతో ఆరోజంతా అప్‌సెట్ అయ్యేది. తనను మళ్లీ మామూలు మనిషిని చెయ్యడానికి చాలా కష్టపడవలసి వచ్చేది నాకు.

సంగీత భోజనం అలవాట్లు కూడా చాలా విభిన్నంగా ఉండేది. ఏ పూటా తను సరిగ్గా భోజనం చేసేది కాదు. కారణం అడిగితే..."ఖారం! నోరు మండిపోతోంది" అనేది. పప్పు అన్నంలో పంచదార వేసుకొని తినేది. కూరా అన్నంలో పెరుగు కలుపుకొని తినేది. అసలు తిండి తినడమే ఒక బోర్ కార్యక్రమంలా ఫీలయ్యేది.

మాట్లాడితే..."సర్ మే దర్ద్(తలనొప్పి) చక్కర్ ఆ రహా (తలతిరుగుతోంది) అంటూ స్టడీరూంలో బల్లమీద తలవాల్చి పడుకునేది.


అందరూ తననో వింత జీవిలా చూసేవారు. ఎవరికైనా ఏదైనా అవసరం వస్తే..నిస్సంకోచంగా, వాళ్లడగకపోయినా సాయం చేసేది. డబ్బులైనాగానీ, ఇంటి దగ్గర నుండి తెచ్చిన తినుబండారాలు గానీ, తనకోసం దాచుకోవాలి అన్న ఆలోచన ఉండేది కాదు. శెలవులకు ఇంటికెళ్లి వచ్చిన రెండు మూడు రోజులూ చాలా హుషారుగా ఉండేది. లేటెస్ట్ హిందీ మూవీలో పాటలన్నీ అద్భుతంగా పాడేది.

మా ఇద్దర్నీ చూసిన వాళ్లంతా "సంగీత కేర్ టేకర్ ఉష" అనేవాళ్లు. నేను సంగీతను "గీతా!" అనిపిల్తే..తను "మామీ" అని ముద్దుగా పిలిచేది వాళ్ల మాటలు నిజం చేస్తున్నట్లుగా.

ఇంతలో నా బర్త్‌డే వచ్చింది. సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలకి..మా రూమ్ తలుపు ఎవరో దబదబా బాదతున్నట్లయి..విసుగ్గా వెళ్లి తలుపు తీశాను, "ఎవరూ?" అంటూ కోపంగా.

ఎదురుగా.. "హాయ్ ఉషా!" అంటూ చిరునవ్వులు చిందిస్తూ సంగీత. మంచి నిద్రపాడుజేసేనందుకు నాకు కోపం నషాళానికి అంటింది. నేను కోపంగా ఏదో అనబోయేంతలో..

"జన్మదిన్ ముబారక్!" అంటూ చటుక్కున నా బుగ్గ మీద ముద్దుపెట్టుకుంది.



నేను స్టన్నయిపోయాను. నా కోపం, నిద్రా ఎటో ఎగిరిపోయాయి. తన ప్రేమకీ, ఆదరణకీ నేను చాలా థ్రిల్లయ్యాను. అర్ధరాత్రి దాకా నాకోసం మేలుకొని ఉండి ఇలా వచ్చి నాకు గ్రీటింగ్స్ చెప్పడం...జన్మలో మర్చిపోలేను. ఇంటిదగ్గర ఉండే అమ్మ, నాన్న, అన్నయ్య నా బర్త్‌డే చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసేవాళ్లు. ఇక్కడ అవన్నీ కుదరవుగా..అందుకే మా నాన్నగారు సాయంత్రమే వచ్చి స్వీట్సూ, బట్టలూ ఇచ్చి వెళ్లారు. అది చూసినట్లుంది సంగీత..ఇలా సర్‌ప్రైజ్‌తో ముంచెత్తింది. ఇంటి దగ్గర లేనన్న వెలితి తీర్చేసింది.

"థేంక్యూగీతా! థెంక్యూ వెరీమచ్!" అన్నాను ఉద్వేగంగా.

ఈ గలాభాకి నా రూమ్మేటు సునీత కళ్లు తెరిచి మా ఇద్దరి వంకా విసుగ్గా చూసి అటు తిరిగి పడుకుంది.

నేనూ సంగీతా ఒకే మంచం మీద పడుకొని మిగతా రాత్రంతా కబుర్లతో గడిపేశాం.

ఆ సాయంత్రం గ్రీటింగ్ కార్డుతోపాటు ఇయర్ రింగ్స్ వున్న చిన్న కవరు ఇచ్చింది. ఆ రింగ్స్ ఎంతో అందంగా, ముద్దుగా ఉన్నాయి. తనిచ్చిన గ్రీటింగ్ కార్డు మీద

"మీకు బహుమతిగా ఏదైనా ఇవ్వాలనిపించింది. ఏది ఇద్దామని చూసినా అది నీకు తగదనే అనిపించింది.

అందుకే నన్ను నేనే బహుమతిగా సమర్పించుకుంటూ ఈ కవర్లో ఇమిడిపోయి నీ దగ్గరకు వస్తున్నాను. నా బహుమతి నీకు నచ్చుతుందనే నా ఆశ!"- గీత

అని ఇంగ్లీషులో ముత్యాల్లాంటి అక్షరాల్లో రాసి వుంది.

సంగీత ఇచ్చిన ఇయర్‌రింగ్స్ కంటే ఆ గ్రీటింగ్ కార్డులోని పదాలు నన్ను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. తనది పొయిటిక్ నేచర్ అని తెలుసు గానీ..భావాలని ఇంత అందంగా అద్భుతంగా ఎక్స్‌ప్రెస్ చేయవచ్చని ఆ కార్డు చూశాకే తెలిసింది. ఆ వేళ్టినుంచి మా మైత్రీబంధం మరింత బలపడింది.

ఇంతలో సంక్రాంతి శెలవులు రావడం, మేమంతా ఊళ్లోకి వెళ్లి రావడం జరిగింది. ఊరు వెళ్లి వచ్చిననూ అందరిలో ఉన్న సంతోషం నాకు సంగీత ముఖంలో కనిపించలేదు. తన ముఖం మబ్బు మూసేసిన చందమామలా కాంతి హీనంగా ఉంది. ఎంతో తరిచి అడిగిన మీదట చెప్పింది. వాళ్ళ డాడీ ఎలాగైనా మంచి ర్యాంక్

**పెబ్బిలి హైమావతి**

సంపాదించాలని..నలుగురిలో తన పేరు నిలబెట్టాలనీ..ఇది లైఫ్ అండ్ డెత్ కొశ్చన్‌గా భావించాలని...అన్నారని చెప్పింది. ఆ మాటలు విన్న నాకు దాన్ని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఎందుకంటే అందరి తల్లిదండ్రులూ కాస్త హెచ్చుతగ్గులుగా ఇవే మాటలు చెప్తున్నారు. చూడడానికి అందులో వింతేమీ కనబడదు. కానీ అవి మామీద ఎంత ఒత్తిడి తెస్తుందో..మేమెంత టెన్షన్‌కు గురవుతామో ఈ తల్లిదండ్రులు గమనించడం లేదు. వాళ్లకు బిడ్డకు ర్యాంకు రావడం కంటే....ఆ ర్యాంకు గురించి పదిమందిలో గొప్పగా చెప్పుకునే దానికే ఈ ఆరాటమంతా అనిపించసాగింది.

* * *

పరీక్షలు దగ్గరపడుతూండటంతో అందరిలో టెన్షన్ మొదలయింది. ఎవరితోనూ ఎవరికీ మాట్లాడే తీరికే లేకపోయింది. మొదట్లో బాగా మార్కులు స్కోరు చేసిన నేను రాను రాను తగ్గిపోసాగాను. మా ఇన్‌స్ట్రక్టరు నన్ను పిలిచి బాగా తిట్టారు. "ఇక్కడికొచ్చేది కాలక్షేపానికీ..ఫ్రెండ్ షిప్ చేయడానికీ కాదు. మీరంతా మంచి ర్యాంకులు తెచ్చుకుంటేనే మీకూ, మాకూ భవిష్యత్ ఉండేది" అని తీవ్రంగా వార్నింగిచ్చారు.

అదంతా సంగీతనీ, నన్నూ దృష్టిలో పెట్టుకొని చెబుతున్నారని అర్థమైంది. నాకు తెలియకుండానే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆఫీసు రూం నుండి బైటకొస్తుంటే సంగీత ఎదురైంది. నావంక సానుభూతిగా చూస్తూ వెళ్లిపోయింది.

అదే రోజు సాయంత్రం నాన్నగారు ఫోన్ చేసి అంత తీవ్రంగా కాకపోయినా అదే రేంజిలో క్లాసు పీకారు.

ఎంత చదివినా ఆ వీక్లీ టెస్ట్‌లో కూడా నాకు తక్కువ మార్కులే వచ్చాయి. సంగీత సరేసరి.

అసలు చిక్కంతా ఎక్కడ వచ్చిందంటే..మాకు సబ్జెక్ట్ రాక కాదు. ఈ ఎమ్‌సెట్ అనేది పిల్లల చదువుకోసం, బాగుకోసం కాక వ్యాపార ధోరణిలో..ఒక ఇన్‌స్టిట్యూట్ మరో ఇన్‌స్టిట్యూట్‌తో పోటీ! వాళ్ల కాలేజీలకే మంచి రేంక్ రావాలి! వాటిని పత్రికలన్నింటిలోనూ ఫుల్ పేజీ ప్రకటనలిచ్చి నెక్స్ట్ ఇయర్‌కి ఇంకా బిజినెస్ చేసుకోవాలి. అని ఎవరికి వారే పిల్లల్ని పగలూ రాత్రీ రుద్దేస్తూ...మామీద విపరీతమైన ఒత్తిడి తీసుకురావడం..ఏమాత్రం రిలాక్సేషన్ లేని బిజీ షెడ్యూల్‌తో ఏం వింటున్నామో, ఏం చదువుతున్నామో తెలియని అయోమయం. నెర్వస్‌నెస్. చివరికిలా పేపర్ సరిగ్గా ఆన్సర్ చేయలేకపోవడం జరుగుతోంది.

వాళ్లు అంత టెన్షన్ క్రియేట్ చెయ్యకపోతే..మాకు అలాంటి పరిస్థితి వచ్చేది కాదేమో!

ఆ మరునాడు సంగీత వాళ్ల డాడీ రాసిన లెటర్ అందుకుంది.

సేమ్ ఓల్డ్ డైలాగ్స్..మళ్లీ, మళ్లీ హెచ్చరిస్తూ రాశారు. అది చదివిన సంగీత ఆరోజు భోజనం చెయ్యలేదు. నేనెంత ప్రయత్నించినా తను నా మాటే వినలేదు. అలా పడుకుని ఉండిపోయింది.

ఆరోజునుండీ ఇద్దరి కిద్దరం చాలా పట్టుదలగా చదవడం మొదలుపెట్టాము. దాని ఫలితంగా తరువాత జరిగిన మంత్లీ టెస్ట్‌లో నాకు మంచి రాంకు వచ్చింది. సంగీతకి ఎప్పటిలాగే తక్కువ మార్కులు వచ్చాయి.

ఎంసెట్ పరీక్ష అప్పటికింకా రెండు నెలలుంది. ఆ మంత్లీ టెస్టులో వచ్చిన మార్కుల ప్రయారిటీతో మమ్మల్ని వేరు వేరు గ్రూప్‌లుగా విడగొట్టారు. దాంతో సంగీతా, నేనూ విడిపోవలసి వచ్చింది.

లంచవర్‌లో కలిసినప్పుడు ఎంతో ధైర్యం చెప్పాను. నా మాటలన్నీ విన్న సంగీత-"ఏమో ఉషా! నాకు రేంక్ వస్తుందనీ..డాడీ కల నిజం చేస్తాననీ నాకేం నమ్మకం లేదు" అంది నిర్లిప్తంగా.

"అలా అనకు గీతా! నీకున్నంత నాలెడ్జ్ మన బ్యాచ్ వాళ్లెవరికీ లేదు తెలుసా? ప్రయత్నిస్తే మా అందరికన్నా మంచి రేంకే సంపాదించగలవు" అన్నాను ఉత్సాహపరుస్తూ.

"నాకేం నమ్మకం లేదు, రేంక్ రాకపోతే..డాడీకి నా మొహం ఎలా చూపించను? అసలీ బ్రతుకే వేస్టనిపిస్తోంది" అంది.


"అదేంమాట? చివర్లో ఇలా అధైర్యంగా మాట్లాడితే ఎలా? ధైర్యంగా చదవవే బాబూ నాకోసమైనా!" అన్నాను.

తరువాత సంగీత నేనూ ఎక్కువగా కలుసుకొనే అవకాశం దొరకలేదు.

పరీక్ష ఇంకా ఇరవై రోజులుందనగా నాకు ఫీవర్ వచ్చింది. టెంపరేచర్ చాలా ఎక్కువగా ఉండడంతో ఊళ్ళో ఉన్న మా మామయ్యకి ఫోను చేసి రప్పించి, నన్నాయనతో వాళ్లింటికి పంపించారు. నాకు జ్వరం వచ్చిన సంగతి సంగీతకు తెలుసో లేదో తనసలు నాకు కనిపించలేదు.

నాలుగు రోజుల తరువాత..జ్వరం తగ్గాక మామయ్య, నేను కేంపస్‌లో అడుగుపెట్టాము. కేంపస్ అంతా గోలగోలగా ఉంది. అందరి ముఖాల్లో ఏదో అలజడీ ఆందోళనా ఏం జరిగిందో ఎవరినడిగినా చెప్పలేదు.

చివరికి..సంగీత రూమ్‌లో ఫేన్‌కి ఉరివేసుకొని చనిపోయిందని చెప్పారెవరో! ఆ మాట వినడంతోనే నా కళ్లు ఒక్కసారిగా చీకట్లు కమ్మాయి. ఒంట్లోని శక్తంతా హరించుకుపోయినట్లయింది. నిల్చున్న చోటే కుప్పలా కూలిపోయాను. "నేను వెంటనే గీతను చూడాలి!" అంటూ హిస్టీరిక్‌గా ఏడవడం మొదలుపెట్టాను. నన్ను ఆపడం ఎవరితరమూ కాలేదు.




గీత ఎందుకిలా చేసింది? అంటూ ఎంతగానో ఏడ్చాను. మరునాడు సంగీత వాళ్ల డాడీ మమ్మీ వచ్చారు. గీత డెడ్ బాడీని చూసి హృదయ విదారకంగా ఏడ్చారు. సంగీత మరణం వాళ్లని చాలా కృంగదీసింది. ఒక్కగాని ఒక్క కూతురు! ఆశలన్నీ తనమీదే పెట్టుకొని పెంచుకున్నారు. చివరికిలా తీరని గుండె కోతని వాళ్లకు మిగిల్చి వెళ్లిపోయింది సంగీత.

తల్లిదండ్రులకు బిడ్డల భవిష్యత్తు మీద ఆశలూ కోరికలూ ఉండడంలో తప్పు లేదు. కానీ అవి తీరకపోతే జీవితమే లేదన్న భావం క్రియేట్ చేస్తే..చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఎంత ఏడిస్తే మాత్రం గీత తిరిగి వస్తుందా?

అసలే సంగీత లోకం పోకడ ఏమాత్రం తెలియనిది! పుట్టిన దగ్గరనుండీ తల్లిదండ్రులు, స్కూలూ తప్ప మరో ప్రపంచం ఎరగదు. ఇక్కడికి వచ్చాక చాలా ఒంటరితనం ఫీలయింది. నాతోడు దొరికాక కొంత రిలాక్సయినా పరీక్షల ఒత్తిడి మా ఇద్దరి స్నేహానికీ అంతరాయం కలిగించింది. తిరిగి గీత డిప్రెషన్‌కు లోనయి ఈ అఘాయిత్యానికి పాల్పడింది. చావే తన సమస్యకు పరిష్కారం అనుకుందిగానీ చచ్చి ఏం సాధిస్తానని అనుకోలేదు. సంగీత కోసం వాళ్ల తల్లిదండ్రుల ఏడ్పు చూస్తుంటే నా మనసెంతో తల్లడిల్లిపోయింది.

ఒక్కసారి సంగీతకి ప్రాణం వచ్చి ఈ దృశ్యం చూస్తే-ఇంకెప్పుడైనా ఇలాంటి అఘాయిత్యం చేస్తుందా? నా పిచ్చిగాని ఒకసారి చనిపోయిన సంగీత మళ్లీ ఎలా బ్రతుకుతుంది?

అంతా అయిపోయాక..సంగీత మమ్మీడాడీ భారమైన మనసుతో, మోయలేని దుఃఖంతో హైదరాబాద్ వెళ్లిపోయారు.

నాకు ఇక చదవాలనే అనిపించలేదు. ఎక్కడికి వెళ్లినా ఏం చేసినా సంగీతే నా కళ్లలో మెదుల్తోంది. నన్ను చూసి మిగతావాళ్లు డిస్టర్బ్ అవుతారని డైరెక్టరుగారు మా నాన్నగార్ని పిలిపించి నన్ను మా ఇంటికి పంపించేశారు.

సంగీత మరణం నన్నెంత కదిలించిందో మా అమ్మానాన్నలనంత భయపెట్టింది. ఇంటికెళ్లాక నాలుగైదురోజులు నన్నెవరూ చదవమని చెప్పలేదు. పైగా అంతవరకూ రేంక్ రాకపోతే లైఫే లేదన్నట్టు మాట్లాడిన అమ్మా నాన్నా నాకెంతో ధైర్యం చెప్పారు.నేను సంగీత కోసం కుమిలి కుమిలి ఏడుస్తుంటే...

"నీ గీత భౌతికంగా నీతో లేకపోయినా నువ్వు బ్రతికున్నంత కాలం గీత జ్ఞాపకాలు సజీవంగానే ఉంటాయి. ఆ స్నేహ సుగంధ పరిమళాలు ఎప్పటికీ వాడిపోవు!" అంటూ అమ్మ నన్ను తన గుండెల్లో పొదువుకుంది. *